మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం

TGBIL/25/A0512

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం
24 సెప్టెంబర్ 2026

పేజీలు : 4

@mvaartanews
www.mivaartanews.com

# శ్రీరామనవమికి ముందే భద్రాచలం ఆలయ పనులు పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.





- ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా వేగం పెంచాలి.
- రాతి పనులకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ రోజువారీ లక్ష్యాలు నిర్దేశించాలి.
- నాణ్యత, శాస్త్రోక్తత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ వద్దు.

**భద్రాచలం సెప్టెంబర్ 23 మన మీ వార్త:**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనులు నిర్వహించాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం భద్రాచలం చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తదుపరి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి మంత్రి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్తర ద్వారం వద్ద ఉన్న దమ్మక్క విగ్రహం ప్రాంతం నుంచి పరిశీలన ప్రారంభించి, వివిధ నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుత దశ, పూర్తికి అవసరమైన సమయం, మానవ వనరులు, నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లిఫ్టులు, స్లాబ్‌లు, రాతి పనులు,



రహదారుల అభివృద్ధి, నిర్మాణ సామగ్రి లభ్యత, సిబ్బంది సమీకరణ, అదనపు నిధులు, సాంకేతిక సమన్వయం తదితర అంశాలపై పనుల వారీగా పురోగతిని పరిశీలించారు. ప్రతి విభాగానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించి, వారంవారీ ప్రణాళిక ప్రకారం పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.275 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే పనులు వేగం పుంజుకున్నాయని, నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతతో పూర్తి చేసేందుకు అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు. శ్రీరామనవమికి ముందుగానే ప్రధాన పనులు పూర్తయ్యేలా రివర్స్ ప్లానింగ్ రూపొందించుకోవాలని, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయం, మాడ వీధులు, అంతర్గత ప్రాకారం, బాహ్య ప్రాకారం తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పనులను ముందుగానే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

లిఫ్ట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన మానవ వనరులను పెంచుకోవాలని, సిబ్బంది కొరత వల్ల పనులు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నిర్మాణ సామగ్రి అందుబాటులో లేక పనులకు అంతరాయం కలగకుండా సెంటరింగ్ తదితర సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని, అవసరమైన చోట బూమ్ పంపులు, ఇతర యంత్ర పరికరాలను వినియోగించి పనుల సామర్థ్యాన్ని పెంచాలని తెలిపారు.

రాతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన నిపుణులు, సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి రోజువారీ లక్ష్యాలతో పనులు నిర్వహించాలని తెలిపారు. చివరి దశలో రాతి పనులు పెండింగ్‌లో ఉండకుండా ముందుగానే పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. గతంలో చేపట్టిన భారీ ఆలయ, జాతర ప్రాంతాల నిర్మాణ పనుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు.

ఆలయ నిర్మాణంలో నాణ్యతతో పాటు శాస్త్రోక్తతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ సంప్రదాయాలు, నిర్మాణ విధానాలకు అనుగుణంగా పనులు సాగుతున్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు.

ఆలయ పరిసర రహదారుల అభివృద్ధికి సంబంధించి సుమారు రూ.25 కోట్ల ప్రతిపాదనను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను సమన్వయంతో అభివృద్ధి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు. నిర్ణీత గడువులు, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సమన్వయంతో పనిచేసి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్‌లు, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ విద్యార్థుల భవిష్యత్‌కు దాతలే అండగా నిలవడం అభినందనీయం.

- సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత.

**చర్ల సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:**

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తూ వారి ఉన్నతికి బాటలు వేస్తున్న వస్త్ర వ్యాపారి గాదంశెట్టి నరసింహారావు--ప్రసన్నలక్ష్మి దంపతుల సేవాభావం అభినందనీయమని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు. చర్ల మండల కేంద్రానికి చెందిన నరసింహారావు మాతృమూర్తి చెంచులక్ష్మి వర్ధంతి సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయానికి బియ్యం అందించడంతో పాటు విద్యార్థులకు భోజనం, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పెద్దాడ ఆశాలత పాల్గొని మాట్లాడారు.

ఆదివాసీ విద్యార్థులపై ఉన్న మమకారంతో నరసింహారావు--ప్రసన్నలక్ష్మి దంపతులు అనేక సందర్భాల్లో విద్యార్థి నిలయానికి విరాళాలు అందిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారని ఆమె కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా ప్రోత్సహించడం ద్వారా పేద, గిరిజన విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థుల చదువుకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని మరువకుండా విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని





సూచించారు. విద్య ఉంటేనే భవిష్యత్ ఉంటుంది. కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు" అని ఆశాలత పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ శ్రమను, సంపాదనను వెచ్చించి పిల్లలను చదివిస్తున్నారని, వారి కష్టాన్ని వృథా చేయకుండా విద్యార్థులు ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొమరం భీం విద్యార్థి నిలయ కమిటీ ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యులు రామకృష్ణ, నిలయ ప్రముఖులు వరలక్ష్మి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి.

**రుద్రవరం :** మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహిస్తున్న భూ రిసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తహశీల్దార్ నాగ వీణ వీఆర్వోలకు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం తహశీల్దార్ నాగవీణ రెవెన్యూ పరమైన అంశాలపై వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ పరిధిలో ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములలో రైతుల నుండి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలకు సూచించామన్నారు. గ్రామాలలో ఇంటి స్థలాల పంపిణీ కొరకు సేకరించిన స్థలాల వివరాలు అందజేయాలని వీఆర్వోలకు సూచించామన్నారు. ఇంకా పలు రెవెన్యూ అంశాలపై సమావేశంలో చర్చించడం జరిగిందని, గ్రామాలలో సమస్యలు ఉన్నట్లయితే వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వీఆర్వోలకు సూచించామని తహశీల్దార్ తెలిపారు.

## రాజారాంపేట"వినాయకుడి లడ్డు పాట 80000.

- లడ్డు పాట కైవసం చేసుకున్న కంటు రామయ్య మనవళ్ళు.



**నేలకొండపల్లి సెప్టెంబర్ 23 మీ వార్త ఆర్ సి.**

నేలకొండపల్లి మండల పరిధిలోని రాజారాంపేట గ్రామపంచాయతీలో ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహం వద్ద బుధవారం ప్రతిష్టాత్మకంగా లడ్డుపాట నిర్వహించారు. ఈ లడ్డు పాటలో గ్రామానికి చెందిన కంటూ రామయ్య మనవళ్లు గోనెల ఉపేందర్ కంటు గోపి గోనెల వెంకటేశ్వర్లు కంటూ వీరస్వామి గణవరపు వీరబాబు 80 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులు వార్డు మెంబర్లు భక్తులు పాల్గొన్నారు. కాగా పెన్ను పాటను గోనెల ఉపేందర్ 16,500 రూపాయలకు దక్కించుకున్నారు.

## కె. లక్ష్మీపురంలో ఘనంగా గణేష్ శోభాయాత్ర.

- భక్తి శ్రద్ధలతో కదం తొక్కిన భక్తజనం.. మార్మోగిన గణపతి నామస్మరణ.



**దుమ్ముగూడెం సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:**

కె. లక్ష్మీపురం గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణేష్ శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పులు, మేళతాళాలు, భక్తుల నృత్యాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని "జై బోలో గణేష్ మహారాజ్" నినాదాలతో శోభాయాత్రను ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం గణనాథుడికి ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నంది సీతారాములు, గంధసిరి వెంకన్న, యాస నారాయణరెడ్డి, నంది సత్యం కనుబుద్ది శ్రీను, దేవా జలగం రాజేష్ అనంతుల రమేష్ సత్యనారాయణ కొన్నే రాములు, మహేష్ ఉపేంద్ర నూకల కృష్ణ రమేష్ ఎల్లయ్య ఉలవ అంజయ్య నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలకు సర్పంచ్ 5016 విరాళం



**కారేపల్లి సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:** సింగరేణి మండలంమాధరం గ్రామపంచాయతీ బీసీ కాలనీ యాదవ సెంటర్ నందు నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొన్న మాదారం సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ ఐదువేల 16 రూపాయల విరాళాన్ని కమిటీకి బుధవారం అందజేశారు. యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ డైరెక్టర్ నరేష్ కుమార్, అజ్మీర శారద, భట్టు సంగయ్య, కోయిల శ్రీనివాసరావు, బట్టు నరసయ్య, కవిటి నాగేశ్వరరావు, బట్టు నరేష్, బీసీ కుల పెద్దలు, యూత్ వినాయక ఉత్సవ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ సీనియర్ నేతగురువయ్య మృతి

నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు.

**కారేపల్లి సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:**



సింగరేణి మండలం పేరుపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ వీరాభిమాని, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిక్కుల గురవయ్య బుధవారం మృతి చెందగా సమాచారం తెలుసుకున్న వైరా శాసనసభ్యులు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం గురవయ్య పార్థీవ దేహానికి కాంగ్రెస్ నాయకులు పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్ల గురవయ్యచేసిన సేవలను, పార్టీ కోసం ఆయన అందించిన కృషిని నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి కుటుంబానికే కాకుండా కాంగ్రెస్ పార్టీకి కూడా తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోతు పద్మావతి, కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వర రావు, గణపారపు లక్ష్మీ నారాయణ, సముద్రాల వీరన్న, కేలోతు శ్రీను, నల్లమోతు కోటేశ్వర రావు, సజ్జ నాగేశ్వర రావు, కేలోతు బాలు, బానోతు వీరభద్రం, మంగు భాను, బండారి నాగేశ్వర రావు, మధ్యాహ్నపు సుధాకర్ తదితరులు పాల్గొని చిక్కుల గురవయ్య గారికి ఘన నివాళులు అర్పించారు.

## జూబ్లీ క్లబ్లో అగర్వాల్ కంటి హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు.

ఖమ్మం సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:



ఖమ్మం జూబ్లీ క్లబ్ లో డాక్టర్ అగర్వాల్ కంటి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి చూపు పరీక్షలు నిర్వహించటమైనది. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మోతుకూరి నాగేశ్వర రావు, సంయుక్త కార్యదర్శి గంగిశెట్టి వెంకటేశం, క్లబ్ కమిటీ క్లబ్ సభ్యులు పాల్గొనుట జరిగినది, తమ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దాదాపు 300 మంది సభ్యులకు కంటి పరీక్షలు నిర్వహించటమైనది.

## రామచంద్రపురం గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.



నేలకొండపల్లి సెప్టెంబరు 23 మీ వార్త ఆర్ సి:

నేలకొండపల్లి మండలం రామచంద్రపురం గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు..మొదట వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు..అనంతరం వారికి ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు...ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నెపూసల సీతారాములు,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నెల్లూరి భద్రయ్య, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు,రామచంద్రపురం సర్పంచ్ దుడ్డెల పవన్,నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యడవల్లి సైదులు,నేలకొండపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి నాగరాజు, ముక్కంటి, కుక్కల వీరబాబు తదితరులు పాల్గొన్నారు..

## ఆయుర్వేదంతో ఆరోగ్యం.

- యోగాతో రోగాలు దూరం.
- మైనార్టీ బాలికల గురుకులంలో ఆయుర్వేదం,యోగా పై అవగాహన.
- ఆయుర్వేద వైద్యురాలు జీ. తన్మయి.

కారేపల్లి: సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:



యోగాతో రోగాలు దూరం అవుతాయని, ఆయుర్వేద మందుల వాడకంతో సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు జి. తన్మయి అన్నారు. 11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం కారేపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల జూనియర్ కళాశాల లో బుధవారం చిన్నారులకు ఆయుర్వేదం, యోగా పై అవగాహన కల్పించి, ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తన్మయి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యాన్ని వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు అన్నారు. ఆయుర్వేద మందులు ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుతాయని, ఈ మందులు వాడడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సైతం నయమవుతాయన్నారు. అదేవిధంగా బాలికలకు వచ్చే జబ్బుల గురించి వివరించి, వాటిని ఏ విధంగా నివారించుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డి .సావిత్రి, వైద్య సిబ్బంది ఫార్మసిస్ట్ స్వాతి, ప్రభాకర్, నర్సింగ్ ఆఫీసర్ జె. మౌనిక పాల్గొన్నారు.

## మండల అధికారుల పర్యవేక్షణలో గణేష్ నిమజ్జన వేడుకలు.

- గ్రామాల్లో నిమజ్జన స్థలాలని పరిశీలన.

కారేపల్లి సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:




గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు కారేపల్లిలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం నిమజ్జనం నిర్వహించే చెరువు ప్రాంతాలను తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయక నిర్వహణ కమిటీ సభ్యులతో సంప్రదించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత పంచాయితీ శాఖ సిబ్బందికి సూచనలు చేశారు. చెరువుల వద్ద భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ సౌకర్యం, లైటింగ్, బారికేడ్లు, వాహనాల రాకపోకలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. నిమజ్జన సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# సేవామూర్తి మెడలో మరో మణిహారం.

- నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డుకు కడవెండి శ్రీనివాస్ ఎంపిక.
- మూడు దశాబ్దాల నిస్వార్థ సేవలకు దక్కిన అరుదైన గుర్తింపు.

ఖమ్మం సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మం సమాజ సేవే ధ్యేయంగా మూడు దశాబ్దాలకు పైగా నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాల్లో ముందుండి, నిస్వార్థంగా సేవలందిస్తున్న కడవెండి శ్రీనివాస్కు ప్రతిష్టాత్మకమైన నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డు లభించడం పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సమాజానికి తన వంతు బాధ్యతగా భావించి ఎన్నో సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న కడవెండి శ్రీనివాస్ సేవలను గుర్తించిన యన్ యమ్ఐ ఫౌండేషన్, నోయిడా, ఉత్తరప్రదేశ్ సంస్థ ఆయనను ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డు ఆయన సేవా ప్రస్థానానికి లభించిన అరుదైన గౌరవంగా పలువురు అభివర్ణించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కొదుమూరి జగన్నాథం మాట్లాడుతూ కడవెండి శ్రీనివాస్కు నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డు రావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వ్యక్తికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం గర్వకారణం. సేవామూర్తి మెడలో మరో మణిహారం చేరింది అని అన్నారు.కడవెండి శ్రీనివాస్ వీసీఐ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్గా, విన్ డైమండ్ కేసీజీఫ్ శ్రేయోభిలాషిగా పలు సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలను ఆశించకుండా సమాజ సేవకు అంకితమై పనిచేయడం




ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు.జేజేలు కడవెండి శ్రీనివాస్ అంటూ పలువురు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు ఆయనకు మాత్రమే కాకుండా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్ కడవెండి విశ్వనాథం, రీజియన్ చైర్మన్ దాస శ్రీనివాసరావు, తేలుకుంట ధనంజయ, తేలుకుంట్ల ఓంకార్, చలవారి శ్రీనివాసరావు, సుగ్గల శ్రీహరి, మారేమళ్ళ రామకృష్ణ, కురివెళ్ల గోపాలకృష్ణ, డోకుపర్తి నాగేశ్వరరావు, పెనుగొండ సూర్యప్రకాష్ తదితరులు కడవెండి శ్రీనివాస్కు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.మూడు దశాబ్దాల సేవకు జాతీయ స్థాయి గుర్తింపు దక్కడం.. కడవెండి శ్రీనివాస్ సేవా ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా నిలిచిందని వారు పేర్కొన్నారు.

# మడకం సూర్యనారాయణ సేవలు చిరస్మరణీయం.

- ఘనంగా తుడుందెబ్బ సీనియర్ నాయకుడు మడకం సూర్యనారాయణ 31వ వర్ధంతి.

**చర్ల సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:** చర్ల మండల కేంద్రంలోని తుడుందెబ్బ కార్యాలయ ప్రాంగణంలో తుడుందెబ్బ సీనియర్ నాయకుడు, కీర్తిశేషులు మడకం సూర్యనారాయణ 31వ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ ఎంప్లాయిస్ రాష్ట్ర నాయకులు సరేం సమ్మయ్య మాట్లాడుతూ.. ఆదివాసీల కోసం మడకం సూర్యనారాయణ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. చర్ల మండల కేంద్రంలో ఆదివాసీలకు తుడుందెబ్బ కార్యాలయం ఏర్పాటు కావడానికి మడకం సూర్యనారాయణతో పాటు మడప లక్ష్మణరావు చేసిన కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. వారి సేవలను భవిష్యత్ తరాలు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, జాతి అస్తిత్వ పరిరక్షణ కోసం మడకం సూర్యనారాయణ నిరంతరం కృషి చేశారని తెలిపారు. తుడుందెబ్బ కార్యాలయం ద్వారా ఆదివాసీల ఐక్యతకు బలమైన వేదిక ఏర్పడిందని, కోమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆదివాసీ జాతి అస్తిత్వాన్ని చాటడంలోనూ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అనంతరం నాయకులు మడకం సూర్యనారాయణ సేవలను స్మరించుకుంటూ నినాదాలు చేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, మండల అధ్యక్షులు పూనెం రవికిరణ్, సహాయ కార్యదర్శి తాటి



శ్రీను, ఆదివాసీ సీనియర్ నాయకులు మడకం రాము, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కారం నరేష్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంద్రేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సింగారెడ్డి పాలెం అంగన్వాడి స్కూల్ ఆవరణలో మోడీ స్వచ్ఛభారత పిలుపును స్వచ్ఛందంగా తీసుకున్న బిజెపి కార్యకర్తలు.

- సేవా సంకల్ప అభియాన్ ఘనం: సింగారెడ్డిపాలెం అంగన్వాడీ స్కూల్లో బిజెపి శ్రమదానం.

నేలకొండపల్లి సెప్టెంబర్ 23 మీ వార్త ఆర్ సి:

నేలకొండపల్లి భారతీయ జనతా పార్టీ నాయకత్వం, కార్యకర్తలు ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారు. దేశ ప్రధాని ప్రియతమ నాయకులు నరేంద్ర మోదీ జన్మదిన పురస్కరించుకుని నేలకొండపల్లి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 17వ తేదీ వరకు నెల రోజుల పాటు జరిగే ఈ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మండల వ్యాప్తంగా పలు సామాజిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సింగారెడ్డిపాలెం గ్రామంలోని అంగన్వాడీ స్కూల్ ఆవరణలో బిజెపి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ నాయకత్వంలో ప్రత్యేక పరిశుభ్రత (శ్రమదానం) కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. పాఠశాల ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి, చిన్నారులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు పరిసరాలను శుభ్రపరిచారు. ఈ శ్రమదాన కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలతో పాటు అంగన్వాడీ స్కూల్ టీచర్ కూడా స్వచ్ఛందంగా భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతలో పాలుపంచుకోవడం విశేషం. చిన్న పిల్లలు చదువుకునే ప్రాంగణం పరిశుభ్రంగా ఉంటేనే వారి ఆరోగ్యం బాగుంటుందని, మోదీ స్వచ్ఛ భారత్ పిలుపును స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమం పూర్తి చేసినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తోందని, వారి ఆశయాలకు అనుగుణంగానే ఈ నెల రోజుల పాటు నేలకొండపల్లి మండలంలో ప్రజలకు ఉపయోగపడేలా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ఈసీ మెంబర్




షరీఫుద్దీన్, మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్, బిజెపి నాయకులు గెల్లా చక్రపాణి, ధారావతు వీరు నాయక్, బానోతు శ్రీనివాస్, తుపాకుల సంజన, అంగన్వాడీ సిబ్బంది గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హోమియోపతి వైద్యురాలు డాక్టర్ పూజ ఆధ్వర్యంలో.

- విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం ఆయుష్ వైద్యంపై అవగాహన.

చర్ల సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:

జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చర్లలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం, ఆయుష్ వైద్య విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హోమియోపతి వైద్యురాలు డాక్టర్ పూజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా హోమియోపతి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజ మాట్లాడుతూ ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యం, యునాని, సిద్ధ, హోమియోపతి వంటి సంప్రదాయ వైద్య విధానాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, పరిశుభ్రత, వ్యాయామం, యోగా, సమతుల్య ఆహారం పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. బాలికలకు యుక్తవయస్సులో వచ్చే శారీరక మార్పులు, నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పరిశుభ్రమైన రుతుస్రావ పరికరాలను ఉపయోగించడం, వాటిని క్రమం తప్పకుండా మార్చడం వంటి అంశాలపై





ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలను దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు లేదా వైద్య సిబ్బందితో మాట్లాడాలని సూచించారు. చిన్న వయసులో తెలియక చేసే పొరపాట్ల వల్ల ఎదురయ్యే అనర్థాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాయమాటలకు, అపరిచితుల ప్రలోభాలకు లోనుకాకుండా చదువు, భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా వైద్య సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. అలాగే పరీక్షల భయం, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, యోగా, ధ్యానం, తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మానసిక సమస్యలు కూడా ఆరోగ్యానికి సంబంధించినవేనని, వాటి గురించి మాట్లాడటంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని తెలిపారు. మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు గోపి, హోమియోపతి ఔషధాల పంపిణీదారు శ్రీకాంత్, వైద్య సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తులస్య తండా, భిక్య తండాలలో మహా అన్నదానం.





**- అప్పాయి గూడెంలో లడ్డు వేలం పాట 42500/-**

**కారేపల్లి సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:** సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ,వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని తులస్య తండా భిక్య తండా గ్రామాల్లో బుధవారం మహా అన్నదాన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.తులస్య తండా గ్రామంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి భుక్యా కన్న కమిలి, భుక్యా విజయ్ కవిత, భుక్యా వినయ్ జ్యోతి, భుక్యా అశోక్ సాల్కు ఇలా సహకారంతో నిర్వహించారు. అదేవిధంగా భిక్య తండా గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.అప్పాయిగూడెం గ్రామంలో కొలువుదీరిన గణపతి విగ్రహం చేతిలోని లడ్డూను వేలం పాటలో అదే గ్రామానికి చెందిన మోడెం వెంకన్న కృష్ణవేణి దంపతులు వేలం పాటలో 42,500/- రూపాయలకు కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలకు సహకరించిన దాతలను, అలాగే గణపతి లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న మోడెం వెంకన్న కృష్ణవేణి దంపతులను సర్పంచ్ దండు ప్రవీణ్ గారు అభినందించారుఅన్నదాన దాతల కుటుంబ సభ్యులకు, అలాగే లడ్డూను దక్కించుకున్న మోడెం వెంకన్న కృష్ణవేణి దంపతుల కుటుంబ సభ్యులకు ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మోట్లగూడెం సర్పంచ్ పొడుగు పెంటయ్య కార్యదర్శి కృష్ణవేణి సాపా బట్ నాగులు నాయక్, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫామ్లపై సెర్ప్ సీఈవో సమీక్ష బాధ్యతాయుతంగా ఇది ను నిర్వర్తించాలి.

**కారేపల్లి సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:**

చేయూత పెన్షన్ల అమలు, పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ల పంపిణీ తదితర అంశాలపై మహిళా సంఘం గ్రామ సమాఖ్యల ప్రతినిధులతో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సంబంధిత పథకాల అమలు తీరు, లబ్ధిదారులకు అందుతున్న సేవలు...చేయూత పెన్షన్ల అమలు, పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సంబంధిత పథకాల అమలు తీరు, లబ్ధిదారులకు అందుతున్న సేవలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. చేయూత పెన్షన్లకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సకాలంలో పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని సీఈవో గ్రామ సమాఖ్య మహిళా సంఘం నాయకులకు (వివోఏ) సూచించారు.గ్రామస్థాయిలో లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తూ, సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని గ్రామ సమాఖ్యల ప్రతినిధులకు సూచించారు.అలాగే పాఠశాల విద్యార్థులకు అందించే యూనిఫామ్ల నాణ్యత, తయారీ, పంపిణీ ప్రక్రియపై సమీక్షించారు. విద్యార్థులకు యూనిఫామ్లు నిర్ణీత సమయంలో అందేలా మహిళా సంఘాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పథకాల అమలులో పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సెర్ప్ సీఈవో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏటీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీ కృషి వల్ల చేయూత పెన్షన్లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం అక్టోబర్ నెలలో పెన్షన్లు అందజేస్తుందన్నారు గ్రామ సమాఖ్యలు ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర ఉన్నందున, క్షేత్రసాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా



కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సీసీలు గౌసియా బేగం, జైపాల్, ప్రసాద్, పద్మ, రాజేశ్వరి, సుమ, రేణుక, వీరస్వామి, అకౌంటెంట్ నాగుబండి నాగలక్ష్మి, గ్రామ సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ దీపికలు పాల్గొన్నారు.

# ఎస్ఐ కుల్సోత్ వెంకన్న మరణం రామవరం 2 టౌన్ ప్రాంతానికి బాధాకరం.

**- పోలీస్ అనే పదానికి నిర్వచనం ఎస్సై కున్సోత్తు వెంకన్న.**

**- స్నేహభావం ప్రేమ తత్వం నిండుగా నిండు ఉన్న మనిషి ఎస్ఐ వెంకన్న.**

**కొత్తగూడెం సెప్టెంబర్ 23 మీ వార్త ఆర్ సి:** ఒక మనిషి మన జీవిత కాలంలో వివిధ వృత్తులు చేస్తూ ఉద్యోగాలు చేస్తూ వారి జీవనాన్ని కొనసాగిస్తూ వారి వృత్తి ఉద్యోగాలకు కీర్తిని గడిస్తారు, అందులో పోలీసు ఉద్యోగం చేసే ప్రతి వ్యక్తి కూడా తన వ్యక్తిగత స్వాలంబన కోసం తన ప్రతిభ ప్రదర్శించుకోవడం కోసం పనిచేస్తూ ఉంటాడు ప్రతి పోలీసు, కానీ పోలీసుల్లో ఉన్నతమైన వ్యక్తిగా కీర్తి గడించిన వాడు కొత్తగూడెం టు టౌన్ ఎస్ఐ వెంకన్న విధి నిర్వహణలో చట్టాన్ని పరిరక్షిస్తూనే సమాజ సేవకుడిగా సమన్వయకర్తగా వ్యవహరిస్తూ తప్పు చేసిన వారిని దండించడమే లెక్క కాకుండా ఆ తప్పును పునరావృతం కాకుండా కౌన్సిలింగ్ చేస్తూ నేరస్తుల్ని కూడా పరివర్తన చెందేలా తన మాటలతో ప్రభావితం చేసే వ్యక్తి వెంకన్న అలాంటి వెంకన్న గణేష్ నిమజ్జనం కార్యక్రమం హైదరాబాదుకు విధి నిర్వహణలో వెళ్లి అక్కడ ట్రాఫిక్ కంట్రోల్ చేసే క్రమంలో ఎవరోవ్యక్తి ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి విధి నిర్వహణలో ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్న వెంకన్నను ఢీకొడం వల్ల స్పృహ కోల్పోయి



కిందపడిన వెంకన్న హుటాహుటిన హాస్పిటల్ కి తరలించగా యాక్సిడెంట్ జరిగిన క్షణంలోనే ఎస్సై వెంకన్న మరణించినట్లుగా వైద్యులు నిర్ధారించడం జరిగినది. మంచి మానవత్వం మూర్తి భావించే వెంకన్న మరణం కొత్తగూడెం టు టౌన్ పోలీస్ డిపార్టుమెంటుకు తీరని లోటుగా భావిస్తూ కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ సంతాపం ప్రకటించడం జరిగింది. అలాగే వారి మరణాన్ని బాధాతప్త హృదయంతో కొత్తగూడెం మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ బాలాజీ నాయక్ సీనియర్ నాయకులు లంబాడి సీతారాం. ఒక కవి అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు తూముల శ్రీనివాస్ తదితరులు సంతాపం ప్రకటించడం జరిగినది.

# ఫార్మర్ ఐడి కొరకు రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి.

**- కామేపల్లి ఏవో బి.తారా దేవి.**

**కామేపల్లి సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:** ఫార్మర్ ఐడి కొరకు రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని కామేపల్లి మండల వ్యవసాయ అధికారి భూక్య తారా దేవి బుధ వారం కోరారు.ఆగస్టు 2026 వరకు కొత్తగా పాస్ పుస్తకం పొందిన,గతంలో నమోదు కాకుండా ఉన్న రైతులు తప్పనిసరిగా ఫార్మర్ ఐడి కోసం ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదు చేసుకోవాలని అన్నారు.



రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐ.డి) వలన కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. ఒక రైతు ఒక గుర్తింపు,సమగ్ర సేవలు అందుతాయన్నారు.రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐ.డి) వరి, పత్తి, మొక్కజొన్న, కంది వంటి పంటల కొనుగోళ్లకు ,ఎరువుల కొనుగోళ్లకు, బ్యాంకుల ద్వారా పంట రుణాల కోసం,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుందన్నారు. రైతు సేవలు, సబ్సిడీలు ఇతర వ్యవసా య సంబంధిత సేవలకు ఈనెల 30 వరకు గ్రామాల్లో రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వ హించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద లేదా మీ సేవా సెంటర్‌లో నమోదు చేసుకోవచ్చు అన్నారు.ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం,ఆధార్‌కు లింక్ ఉన్న ఫోన్ నంబర్ తీసుకెళ్లి నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే నమోదు చేసుకున్నవారు పోస్టర్‌లో ఇచ్చిన లింక్ ద్వారా ఆధార్ నెంబర్‌తో ఎంటర్ చేసి రైతు ఐ.డి నంబర్‌ను పొందవచ్చునని ఆమె



తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ మేరకు ప్రచారం కూడా నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు బానోత్ జగదీష్, దీపక్ రెడ్డి, భాస్కర్, ఉష, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# కామేపల్లి లో ఎడతెరిపి లేకుండా వర్షం.

**- గణేష్ నిమజ్జన వేడుకలకు అంతరాయం.**

**- ఇబ్బందులు పడిన ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు.**

**కామేపల్లి సెప్టెంబర్ 23 మీ వార్త ప్రతినిధి:**



కామేపల్లి మండలం లో బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం తో వర్షం కురిసింది. దీంతో గణేశ్ నిమజ్జన వేడుకలకు అంతరాయం కలిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులు ఇబ్బందు లు పడ్డారు. ఈ వర్షం తో వరి పంటకు మేలు జరుగుతుం డగా, కాయలు ఏర్పడిన పత్తి చెట్లు గాలులకు విరిగిపోయే ప్రమాదం ఉందని పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

# విజయవంతంగా ముగిసిన ఆకునూరి మల్లయ్య, రాజమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలు.

**- వర్షం కురుస్తున్న లెక్కచేయకుండా కంటి పరీక్షలు నిర్వహించుకున్న బాధితులు.**

**- కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ అభినందనీయులు.**





**కొత్తగూడెం సెప్టెంబర్ 23 మీ వార్త ఆర్ సి:** శ్రీ ఆకునూరి మల్లయ్య శ్రీమతి రాజమ్మ దంపతుల జ్ఞాపకార్థం ఆకునూరి సుప్రియ కార్పొరేటర్ ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ కంటి హాస్పటల్ వరంగల్ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగినది, ఈ ఉచిత కంటి పరీక్షా కేంద్రానికి విచ్చేసిన కొంతమందికి రెటీనా కంటి చుక్కాలు ప్రాబ్లం ఉన్నవాళ్లను గుర్తించి వరంగల్ కు పంపి ఆపరేషన్ చేయాల్సి వచ్చిన వారిని వర్ష ప్రభావం తగ్గిన తర్వాత పంపించడానికి వారి పేరులను నమోదు చేసుకోవడం అనేది ఈ కార్యక్రమంలో వందలాదిమంది కంటి సమస్యలు ఉన్నవారు పాల్గొని వారి కంటిని పరీక్షించుకోవడం జరిగినది, ఈ మహోన్నతమైన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తగూడెం సింగరేణి కాలరీస్ జిఎం వెంకటరమణ,, జిఎం పర్సనల్ గడిపెల్లి రాజేంద్రప్రసాద్ ఉమ్మడి ఖమ్మం జిల్లామాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు గడి పెల్లి కవిత, సింగరేణి కార్మిక నాయకుడు తెలంగాణ ఉద్యమకారులు ఆకునూరి కనకరాజు, తోగరు రాజశేఖర్, మొక్కల రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ ఐఎన్టీయూసీ సీనియర్ నాయకులు ఎస్కే గౌస్, బి సుందర్ మైనుద్దీన్, కొమరయ్య, బాబూరావు, రాజవీరు, రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## క్యాబ్ ఎక్కుతుండగా ముద్దుపెట్టుకున్న సెక్యూరిటీ గార్డ్

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సెక్యూరిటీ గార్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందిరానగర్ ప్రాంతంలో ఈ ఘటన వెలుగుచూసింది.ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి క్యాబ్ ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా, రాజ్‌కుమార్ అనే సెక్యూరిటీ గార్డ్ ఆమె వద్దకు వచ్చాడు. ఒక్కసారిగా ఆమెను పక్కకు లాగి బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు. ఈ ఆకస్మిక పరిణామంతోగ్భ్రాంతికి గురైన బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని ఝార్ఖండ్‌కు చెందిన రాజ్‌కుమార్‌గా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. పారిపోయిన నిందితుడు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సెక్యూరిటీ గార్డు రాజ్‌కుమార్‌గా గుర్తించిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా, టెక్నాలజీ సాయంతో అతడిని అరెస్ట్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు.నిందితుడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నడిరోడ్డుపై జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది: జూరాల నీటి విడుదలపై కేటీఆర్

**హైదరాబాద్ :** జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు.రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

## పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా గణనాథుని పూజలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**

**కరీంనగర్** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రతిష్ఠించిన గణనాథునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపిఎస్ ప్రత్యేక పూజల్లో పాల్గొని గణనాథునికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో పాటు పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బిజినెస్

### ఆదివారం కూడా పనిచేయనున్న బ్యాంకులు.. మూడు రోజుల సమ్మె నేపథ్యంలో నిర్ణయం



వచ్చే ఆదివారం, సెప్టెంబర్ 27న దేశంలోని బ్యాంకులు పనిచేయనున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకులు ఆదివారం కూడా పని చేస్తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సెప్టెంబర్ 28–30 వరకు మూడు రోజులపాటు బ్యాంకు సిబ్బంది సమ్మె చేయబోతున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రకటించిన సంగతి తెలిసిందే. వరుసగా మూడు రోజులపాటు బ్యాంకులు పని చేయకపోవడం వల్ల వినియోగదారులకు ఇబ్బంది కలుగుతుందని, అందువల్ల ఆదివారం సెలవు రోజైనప్పటికీ బ్యాంకులు పనిచేసేలా నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. ప్రజల బ్యాంకింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. బ్యాంకులు, ఏటీఎంలు సెప్టెంబర్ 27 వరకు పూర్తిస్థాయిలో పని చేయాలని ఇటీవల ఆర్బీఐ ఆదేశించింది. ఈ నెల 26 నాలుగో శనివారం బ్యాంకులు పని చేయవు. అలాగే, 27వ తేదీ ఆదివారం సెలవు. ఆ తర్వాత 28, 29, 30.. ఇలా మూడు రోజులు సమ్మె. దీంతో వరుసగా ఐదు రోజులు సెలవులు రావడం వల్ల వినియోగదారులు ఇబ్బంది పడతారు. అందుకే..సెప్టెంబర్ 27, ఆదివారం బ్యాంకులు పని చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి ఆర్బీఐ కూడా ఆమోదం తెలిపింది. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మాత్రమే ఆదివారం పని చేస్తాయి. సమ్మె వల్ల కలిగే ఇబ్బందుల గురించి వివిధ బ్యాంకులు ముందుగానే వినియోగదారులకు సమాచారం అందిస్తున్నాయి. వినియోగదారులు కూడా ఈ సమ్మెకు అనుగుణంగా ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది.

### షేర్లన్నీ అమ్మేసి.. పైన్ ల్యాబ్స్ నుంచి మాస్టర్‌కార్డ్ ఔట్




**న్యూఢిల్లీ:** గ్లోబల్ పేమెంట్స్ సొల్యూషన్స్ దిగ్గజం మాస్టర్‌కార్డ్ తాజాగా పైన్ ల్యాబ్స్ నుంచి పూర్తిగా వైదొలగింది. బీఎస్ఈ బ్లాక్ డీల్స్ వివరాల ప్రకారం షేరుకి రూ. 187.75 సగటు ధరలో 4.31 శాతం వాటాకు సమానమైన 4,97,24,182 షేర్లు విక్రయించింది. తద్వారా దాదాపు రూ. 934 కోట్లు అందుకుంది. అనుబంధ సంస్థ మాస్టర్‌కార్డ్ ఆసియా పసిఫిక్ పీటీఈ ద్వారా 13 డీల్స్ ద్వారా వాటాను అమ్మివేసింది. కొటక్ మహీంద్రా, ఎడిల్‌వీజ్, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ తదితర మ్యూచువల్ ఫండ్స్‌తోపాటు.. ఐసీఐసీఐ ప్రు డెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఈ వాటాలను కొనుగోలు చేశాయి. విదేశీ ఇన్వెస్టర్ సంస్థలు గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లీ, సిటీగ్రూప్ గ్లోబల్ సింగపూర్, బీఎన్‌పీ పారిబాస్ అర్బిట్రేజ్, సొసైటీ జనరాలి తదితరాలు సైతం పైన్ ల్యాబ్స్ షేర్లను సొంతం చేసుకున్న జాబితాలో చేరాయి.

## నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ.

– ఐటీడీఏ పీవో బి రాహుల్.

భద్రాచలం సెప్టెంబర్ 23 మన మీ వార్త:




సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ భద్రాచలం వారి ఆధ్వర్యంలో ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు 3 నుంచి 4 నెలల పాటు ఉద్యోగ నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. భద్రాచలం, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వరావుపేట మరియు ఖమ్మం లో ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

**శిక్షణ కోర్సులు.**

సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్ మహిళలు 18--35 ఏళ్లు, 5వ తరగతి ఉత్తీర్ణత.

బ్యూటీ థెరపిస్ట్ మహిళలు, 18--35 ఏళ్లు, 8వ తరగతి ఉత్తీర్ణత.

కంప్యూటర్ హార్డ్‌వేర్ టెక్నీషియన్ -- పురుషులు, 18--30 ఏళ్లు, ఇంటర్మీడియట్.

గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ -- మహిళలు, పురుషులు, 18--30 ఏళ్లు, ఎస్ ఎస్ సి.

డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ -- మహిళలు, పురుషులు, 18--35 ఏళ్లు, ఎస్ ఎస్ సి.

జనరల్ డ్యూటీ అసిస్టెంట్ -- మహిళలు, 18--35 ఏళ్లు, ఎస్ ఎస్ సి.

మల్టీ స్కిల్ టెక్నీషియన్ -- పురుషులు, 18--35 ఏళ్లు, ఎస్ ఎస్ సి.

హోటల్ మేనేజ్మెంట్ మహిళలు,18--30 ఏళ్లు, ఎస్ ఎస్ సి.

శిక్షణ కేంద్రాలు.

భద్రాచలం గిరిజన భవన్ సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్, ఇల్లందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్, అశ్వారావుపేట వీఊణా కార్యాలయం సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్, ఖమ్మంలో రోటరీ నగర్ పోలీస్ స్టేషన్ పక్కన యూత్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం వసతి యూనిఫామ్ స్టడీ మెటీరియల్ మరియు శిక్షణ తదనంతరం సర్టిఫికెట్ ఇప్పించడం జరుగుతుందని ఆయన అన్నారు.

ఆసక్తి, అర్హత ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరుతూ మరిన్ని వివరాల కోసం సంబంధిత శిక్షణ కేంద్రాల ఫోన్ నంబర్లు 9347 46 6615, 810 6141505, 9866 113645, 90 59667710, 630 580 2724 సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

## రిస్కుల్లో భారత ఆర్థిక వృద్ధి.. డీబీఎస్ బ్యాంక్ అంచనా

**న్యూఢిల్లీ:** భారత ఎకానమీ వృద్ధికి ద్రవ్యోల్బణం, లిక్విడిటీపరమైన రిస్కులు పొంచి ఉన్నాయని డీబీఎస్ బ్యాంక్ వెల్లడించింది. ఇంధనాల ధరలు అధిక స్థాయిలో కొనసాగుతుండటం, కఠినతర ఆర్థిక పరిస్థితులు మొదలైన అంశాల వల్ల కార్యకలాపాలపై ప్రభావం పడనుందని పేర్కొంది. దీనితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో వృద్ధి ఒక మోస్తరు స్థాయికే పరిమితం కావొచ్చని డీబీఎస్ బ్యాంక్ ఈడీ, సీనియర్ ఎకానమిస్ట్ రాధికా రావు విశ్లేషించారు. 2026 ఆర్థిక సంవత్సర వృద్ధి గణాంకాలను 7.8 శాతానికి సవరిస్తూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సర వృద్ధి సగటున 7.3 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. వస్తు, సేవల పన్నుల వసూళ్లు, ఈ--వే బిల్లులు, విద్యుత్ డిమాండ్, డిజిటల్ చెల్లింపులు పటిష్టంగా ఉన్నాయని..కాకపోతే ద్రవ్యోల్బణం కీలక రిస్న?కగా మారుతోందని చెప్పారు. వర్షపాతం సగటు స్థాయి కంటే తక్కువగా ఉండటం, ఎల్ నినో రిస్న?కలు పెరగడం వల్ల పంటల దిగుబడిపై ఒత్తిడి ఎక్కువగా ఉండొచ్చని రాధికా రావు వివరించారు.




# చెలరేగిన భారత బౌలర్లు.. 171 పరుగులకే ఆసీస్ ఆలౌట్

ఆస్ట్రేలియా– 'ఎ' జట్టుతో తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత్– 'ఎ' బౌలర్లు అదరగొట్టారు. కంగారూ టాపార్డర్‌ను కకావికలం చేసి ఆది నుంచే చుక్కలు చూపించారు. భారత బౌలర్ల విజృంభణ కారణంగా ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 171 పరుగులే చేసి ఆలౌట్ అయింది.

**పుదుచ్చేరి వేదికగా**

కాగా భారత్– 'ఎ' జట్టుతో రెండు అనధికారిక టెస్టులు, మూడు అనధికారిక వన్డేలు ఆడేందుకు ఆసీస్ పురుషుల జట్టు ఇండియాకు వచ్చింది. ఇందులో భాగంగా అన్ని మ్యాచ్‌లు పుదుచ్చేరిలో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో మంగళవారం మొదలైన తొలి అనధికారిక టెస్టులో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది.

**కుశాగ్రా సెంచరీ**

ఓపెనర్ సాయి సుదర్శన్ (57), ఆల్‌రౌండర్ తనుశ్ కొటియాన్ (69) అర్ధ శతకాలు బాదగా.. బుధవారం నాటి రెండో రోజు ఆట సందర్భంగా కుమార్ కుశాగ్రా శతకం పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 240 బంతులు ఎదుర్కొన్న ఈ వికెట్ కీపర్ బ్యాటర్.. 12 ఫోర్ల సాయంతో 113 పరుగులు రాబట్టాడు. మిగిలిన వారిలో అన్షుల్ కాంబోజ్ (23) చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు.

**ఆసీస్ టాపార్డర్ కుదేలు**

ఫలితంగా భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 117.3 ఓవర్లు ఆడి 334 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ క్రమంలో రెండో రోజు బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆసీస్‌కు ఆది నుంచే షాకులు తగిలాయి. ఓపెనర్ కాంప్‌బెల్ కెల్లావే (2), వన్‌డౌన్ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీనీ (0) పూర్తిగా విఫలం కాగా.. కెప్టెన్ పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (8) కూడా నిరాశపరిచాడు. మరో ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (76 బంతుల్లో 25), జేసన్ సంఘా కలిసి (64 బంతుల్లో 46) ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే, షమ్స్ ములాని సంఘాను అవుట్ చేసి ఈ జోడీని విడదీయగా.. తుషాన్ దేశ్‌పాండే కొన్‌స్టాస్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు.

**షమ్స్ ములానికి నాలుగు వికెట్లు**




ఆ తర్వాత ఆసీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. వికెట్ కీపర్ బ్యాటర్ జోష్ ఫిలిప్ (14) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరగా.. ఆల్‌రౌండర్ లియామ్ స్కాట్ 26 పరుగులు చేయగలిగాడు. మిగిలిన వారిలో ఫెర్గూస్ 13, టాడ్ మర్ఫీ 12, బ్రెండన్ డాగెట్ 13 పరుగులు చేయగా.. కోరే రొచిసియోలి 4 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో బుధవారం నాటి ఆట పూర్తయ్యేసరికి 55.3 ఓవర్లలో ఆసీస్ 171 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ షమ్స్ ములాని నాలుగు వికెట్లతో చెలరేగగా.. స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ తనుశ్ కొటియాన్ రెండు, పేసర్లు తుషార్ దేశ్ పాండే రెండు, అన్షుల్ కాంబోజ్, ప్రఫుల్ హింగే తలా ఒక వికెట్ దక్కించుకున్నారు. ఇక ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్‌కు 163 పరుగుల భారీ ఆధిక్యం లభించింది.




## స్పోర్ట్స్

### బ్యాడ్మింటన్‌లో కాంస్యంతో సరి.. ఫైనల్‌కు చేరిన రోషిబిన



**ఇంటర్నెట్ డెస్క్:** ఆసియా క్రీడల్లో నాలుగో రోజు భారత్‌కు నాలుగు పతకాలు వచ్చాయి. వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను రజతం గెలుచుకోగా.. స్కీట్ పురుషుల, మహిళల విభాగంలో కాంస్యాలు వరించాయి. తాజాగా భారత్ ఖాతాలో మరో కాంస్యం వచ్చి చేరింది. బ్యాడ్మింటన్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ సెమీస్‌లో ఓడిపోయింది. దీంతో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. వుషు అథ్లెట్ రోషిబిన అద్భుతం చేసింది. వరుసగా రెండోసారి ఆసియా గేమ్స్ ఫైనల్‌కు చేరుకుంది. గత ఎడిషన్‌లో రోషిబిన రజతం నెగ్గింది. అంతకుముందు 2018లో కాంస్యం సాధించింది.

**చైనా చేతిలో ఓటమి..**

సెమీస్‌లో భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టుకు తీవ్ర పోటీ ఎదురైంది. డిఫెండింగ్ ఛాంపియన్ చైనా ముందు నిలవలేకపోయింది. చివరికి 1–3 తేడాతో భారత్‌పై చైనా విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో లక్ష్య సేన్ ఓడిపోగా. సాత్విక్ – చిరాగ్ శెట్టి అద్భుతంగా ఆడి తొలి డబుల్స్‌లో గెలిచారు. అయితే, రెండో డబుల్స్‌తోపాటు సింగిల్స్‌లో భారత ప్లేయర్లు తేలిపోయారు. సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి.. డబుల్స్‌లో అర్జున్ – హరిహరణ్ కూడా ఓటమితో భారత్ సెమీస్‌లోనే వెనుదిరిగింది. దీంతో చైనా ఫైనల్‌కు చేరుకుంది.

**కబడ్డీలో సెమీస్‌కు..**

పురుషుల కబడ్డీ టీమ్ అదరగొట్టేస్తోంది. హ్యాట్రిక్ విజయాలతో సెమీస్‌కు దూసుకెళ్లింది. దీంతో పతకం ఖాయం చేసుకుంది. గ్రూప్ స్టేజ్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఏ దశలోనూ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. చివరికి 48–25 తేడాతో భారత్ విజయం సాధించింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో 11 పతకాలు ఉన్నాయి. అందులో ఒక స్వర్ణం, ఐదు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. పట్టికలో 13వ స్థానంలో ఉంది. చైనా (58), జపాన్ (48), దక్షిణ కొరియా (29), కజకిస్తాన్ (14), థాయ్‌లాండ్ (6) టాప్ –5లో కొనసాగుతున్నాయి.